క్లుప్తంగా

కన్నులపండువగా భీమేశ్వరుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణం గతంలో ఎప్పుడూ లేనంత వైభవంగా నిర్వహించారని రామచంద్రపురం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చెరుకు బాబూరావు, నాయకులు పసుమర్తి భీమ శంకరుడు, పసుమర్తి శ్రీనివాస్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు ఐఏఎస్ అధికారులు, ఒక ఐపీఎస్ అధికారి కల్యాణ వేడుకల్లో పాల్గొనడమే కాకుండా కల్యాణం వారం రోజులూ కన్నుల పండువగా నిర్వహించినందుకు మంత్రి వేణుకు, దేవాదాయ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

పూర్వ విద్యార్థి విరాళం

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి చిట్టూరి కృష్ణారావు రూ.50 వేల విరాళాన్ని హెచ్‌ఎం పితాని శ్రీనివాస్‌కు బుధవారం అందజేశారు. పాఠశాలలో బాలికలు, బాలుర సైకిల్ స్టాండ్‌ల వద్ద కంకర వేసి అభివృద్ధి చేసేందుకు నిధులు వాడాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణారావును పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టూరి రామ్మోహనరావు, ద్వారంపూడి యువరాజారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంకు చెందిన వల్లు సత్యనారాయణ(45) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్‌ఐ బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. సత్యనారాయణకు అప్పులున్నాయని, వారి వేధింపులు తాళలేక ఈ నెల 6న పురుగుల మందు తాగాడన్నారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భార్య సరస్వతి ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు గ్రామ సర్పంచ్ బుంగా మేరి అనారోగ్యంతో మృతి చెందిన కారణంగా ఉప ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు బుధవారం గ్రామంలోని 10 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల స్థితిగతులు ఆరా తీసి తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.కీర్తిస్పందన, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు పేదరికమే ప్రామాణికం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో కొనసాగుతున్న గడప గడపకూ..


ఏడిదలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట


శీల గ్రామస్తులతో మాట్లాడుతున్న నరేన్

మండపేట: రాజకీయాలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి బుధవారం ఆయన మండలంలోని ఏడిద 2వ వార్డు రజకపేట, మెయిన్ రోడ్డులోని రాజీవ్‌గాంధీ సెంటర్ ఏరియాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల జగన్ పాలనలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడిక్కడే ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, కార్యదర్శి వుండమట్ల వీర్రాజులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ మూడున్నరేళ్లలో చేసిన ప్రగతిని వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఆర్బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, ఉప సర్పంచ్ చంద్ర శ్రీనివాస్, పార్టీ నాయకులు పలివెల సుధాకర్, కొండపల్లి సత్తిబాబు, జగన్, తాతపూడి రాజేష్ పాల్గొన్నారు.

జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. మండలంలోని శీలలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు తదితరులతో కలిసి ఆయన బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మొత్తం మీద ఇంత భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పార్టీ మండల ప్రధానకార్యదర్శి పోతురాజు బాబురావు, గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణకుమారి, టేకుమూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ పంపన నాగమణి


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి

కె.గంగవరం: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి పలు సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, గృహనిర్మాణ, ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, విద్యాశాఖ తదితర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. దంగేరు సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ దంగేరు శివారు గ్రామాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కూళ్ల ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూళ్ల గ్రామస్తులైన 50 మందికి యండగండి గ్రామంలో ఇళ్ల స్థలాలను కేటాయించారని వారికి స్థలం చూపిస్తే ఇళ్లు నిర్మించుకుంటారని అడిగారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథశర్మ, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాల, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎన్నికైన ప్రొఫెషనల్స్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

రామచంద్రపురం: పట్టణంలోని అయ్యప్ప అన్నదాన సమాజ భవనంలో రామచంద్రపురం ప్రొఫెషనల్స్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గాదం మధుసూదనరావు, ఉపాధ్యక్షుడిగా కుడిపూడి వెంకటరమణ, రాపర్తిశ్రీరామ్, కార్యదర్శిగా సుంకర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా గోవర్ధన శశికాంత్, సన్నపు ఫణికుమార్, కోశాధికారులుగా అడబాల శివబాల గణేష్, యర్రంశెట్టి వరప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అన్నదాన సమాజం అధ్యక్షుడు నల్లమిల్లి జనార్దనరెడ్డి, మద్దిరెడ్డి వరప్రసాద్, జి.సురేష్‌కుమార్, ఎస్.దొరబాబు, ఎస్వీ భాస్కరరావు, సిర్ల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి



కాజులూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు

కాజులూరు: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశభవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో తమతమ శాఖల్లో జరుగుతున్న పనుల ప్రగతి అధికారులు వివరించారు. సాగునీటి సరఫరాలో తలెత్తున్న సమస్యల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కొందరు సభ్యులు ప్రస్తావించారు. పీడబ్ల్యూడీ ఏఈ ప్రవీణ్ స్పందించి గోదావరిలో నీటినిల్వలు తగ్గడంతో సరఫరాలో ఇబ్బంది నెలకొందని, అయితే వంతుల వారీ విధానం ద్వారా శివారు భూములకు సైతం సాగునీరు అందిస్తున్నామన్నారు. జగనన్న భూ సర్వేపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మండల తహసీల్దార్ బి.సాయిసత్యనారాయణ సమాధానమిస్తూ మండలంలో 19 గ్రామాల్లో భూ సర్వే చేపట్టగా తొమ్మిది గ్రామాల్లో పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మజీ, జగన్నాథగిరి ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

46 మంది విద్యార్థినులకు ఉపకార వేతనాలు

మండపేట: బాలిక విద్యను ప్రోత్సహించేందుకు రాజమహేంద్రవరంలోని మలబార్ గోల్డ్ సంస్థ అందిస్తున్న ఉపకార వేతనాలకు పట్టణంలోని ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 46 మంది విద్యార్థినులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కో విద్యార్థినికి రూ. 10,000 చొప్పున మలబార్ సంస్థ విద్యార్థినుల బ్యాంకు అకౌంట్లకు నగదు జమ చేసిందన్నారు. ఈ సందర్భంగా బుధవారం లెక్చరర్ సువర్ణకుమార్, పీడీ ఈవీవీ సత్యనారాయణ, విద్యార్థినులు రాజమహేంద్రవరం వెళ్లి మలబార్ గోల్డ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫైబర్ కేబుల్ తీగలు కత్తిరించారని ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఫైబర్ కేబుల్ తీగలను కత్తిరించారని పోలినాటి గౌతమ్ అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్‌ఐ బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల ప్రకారం దూడల శ్రీనివాస్ అనే వ్యక్తి కేబుల్ ప్రసారాల్ని తన నుంచి మాత్రమే తీసుకోవాలని ఫోన్ ద్వారా బెదిరిస్తున్నారని, అతని ప్రోద్బలంతో శ్రీనివాస్, వీరబాబు అనే వ్యక్తులు తనకు చెందిన ఫైబర్ కేబుల్‌ను కత్తిరించి దొంగిలించారని గౌతమ్ అభిషేక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుల్ని నిర్ధారించుకున్నట్లుగా ఫిర్యాదులో తెలిపాడని ఎస్‌ఐ చెప్పారు.

జగన్నాయకులపాలెంలో పొలంబడి

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఎరువుల యాజమాన్యం, మిత్ర పురుగుల సంరక్షణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ చేతుల మీదుగా 50 శాతం రాయితీపై రైతులకు అవసరమైన బయో పురుగు మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సాదే రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు సీహెచ్ లోవరాజు, రైతులు పాల్గొన్నారు.

రాయవరంలో శ్రీవారి నక్షత్ర కల్యాణం

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నక్షత్ర కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మాఘ మాసం, అమ్మవారి పుబ్బ నక్షత్రం కావడంతో స్థానిక వేంకటేశ్వర భక్తజన సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. అంగర అయ్యమాచార్యుల ఆధ్వర్యంలో పెద్దింటి కృష్ణమాచార్యులు, అంగర రామకృష్ణ శోభన్‌బాబు, శోభనాద్రాచార్యులు, వెంకటలక్ష్మీనారాయణాచార్యులు యజ్ఞ నిర్వహణ చేశారు. రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన 400 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

కాజులూరు: కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు డాక్టర్ జాస్తి శివరామకృష్ణ పాఠశాలకు రూ.18 వేలు విలువ చేసే కథల పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్వీ చలపతి ఒక తరగతి గదిని గ్రంథాలయంగా మార్చి ప్రముఖ కవి మధునాపంతుల సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మధునాపంతుల ఫౌండేషన్ కార్యదర్శి ఎం.చలపతిరావు, దుగ్గుదుర్రు యూపీ స్కూల్ ఉపాధ్యాయుడు షరీఫ్, సీఆర్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


కేశవరం పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మండపేట: మండలంలోని కేశవరం పీహెచ్‌సీలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, ఆస్పత్రిలో మౌలిక వసతులు, తాగునీటి లభ్యత, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నివేదికను విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్‌కు అందజేయనున్నట్టు డీఎస్పీ పి.ముత్యాలనాయుడు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేశామన్నారు. ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, ఏఓ భార్గవ మహేష్, తహసీల్దార్ విజయకుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుళ్లు లోవకుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు